అబద్ధాలతోనే పదేళ్ల మోదీ పాలన

బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల నరేంద్రమోదీ పాలనలో బీజేపీ కేవలం అబద్ధాలు, భ్రమలతోనే రాజకీయం చేసిందని కేపీసీసీ ఉపాధ్యక్షుడు వీఆర్ సుదర్శన్ మండిపడ్డారు. శుక్రవారం కాంగ్రెస్ అధికార ప్రతినిధి రమేశ్‌బాబుతో కలసి మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. దేశంలో సామాన్యుల జీవనం దారి తప్పిందన్నారు. 2014లో 453 రూపాయలు ఉన్న వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.900కు పెరిగిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు.


మునవల్లి నిరసనలో పాల్గొన్న ప్రజలు

తండ్రి నిరంజన్ హిరేమఠతో నేహా హిరేమఠ (ఫైల్)

అమానుషంపై ఆగ్రహం

- దోషిని ఉరితీయాలని డిమాండ్
- స్వచ్ఛందంగా సహకరించిన ముస్లిం వర్గాలు
- ముమ్మాటికీ లవ్ జీహాదే : ఏబీవీపీ, బజరంగ్‌దళ్
- కాదు వ్యక్తిగత కారణాలే : సీఎం సిద్దరామయ్య
- సమగ్ర దర్యాప్తు అవసరం : కేంద్రమంత్రి జోషి

విద్యార్థిని హత్యపై మునవల్లి బంద్

బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిని అమానుషంగా కత్తితో పొడిచి చంపడంపై రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంత్లో నిరసనలు వెల్లువెత్తాయి. హుబ్బళ్లి కళాశాల క్యాంపస్ లో ఎంసీఏ విద్యార్థిని నేహా హిరేమఠ (25) హత్య విషయం హుబ్బళ్లి-ధారవాడ జిల్లాలతోపాటు రాష్ట్రమంతటా సంచలనమైంది. గురువారం కళాశాల క్యాంపస్‌లో ఉన్న విద్యార్థినిపై చాకుతో గొంతు కోసి ఆ తర్వాత ఏకంగా 9సార్లు పొడవడంతో ఆమె మృతి చెందింది. ప్రేమించలేదనే కారణంతో ఫయాజ్ అనే యువకుడు ఈ దారుణానికి ఒడిగట్టాడు. విద్యార్థిని హత్య వెనుక కుట్ర ఉందని ఇదో లవ్ జిహాదీ అంటూ ఏబీవీపీ, భజరంగ్‌దళ్ సహా పలు హిందూ సంఘాలు ఆరోపించాయి. కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి శుక్రవారం విద్యార్థిని మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కళాశాలలోనే దారుణానికి పాల్పడ్డాడంటే ఎంతకు తెగించి ఉంటారని ఆరోపించారు. ఇదో లవ్ జిహాదీలాంటిదేనని సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. నేహా హిరేమఠ తండ్రి నిరంజన్ హిరేమఠ మాట్లాడుతూ తాను కాంగ్రెస్ కార్పొరేటర్ అని అయితే సీఎం సిద్దరామయ్య మాత్రం హత్య సంఘటన వ్యక్తిగతమనే వ్యాఖ్య బాధ కలిగించిందన్నారు. ప్రజలు ఆయనను నమ్మి గెలిపించారని ఇలా బాధలో ఉన్నవారి పట్ల పరుషంగా మాట్లాడరాదన్నారు. కొన్ని రోజులుగా తన కుమార్తెను వశం చేసుకోవాలని ప్రయత్నించారని, అయితే తన కుమార్తె పట్ల విశ్వాసం ఉండేదన్నారు. హత్య వరకు దారి తీస్తుందని అనుకోలేదన్నారు. హంతకుడిని ఎన్‌కౌంటర్ చేయాలని అతడితోపాటు మరో నలుగురు ఉన్నారని వారిని అరెస్టు చేయాలన్నారు. హత్యకు పాల్పడిన ఫయాజ్ సొంతూరు సవదత్తి తాలూకా మునవళ్ళి పట్టణంలో ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించి నిరసన తెలిపారు. నిందితుడికి ఉరిశిక్ష విధించాలని కోరుతూ నినాదాలు చేశారు. మునవళ్ళిలోని పంచలింగేశ్వర దేవస్థానం క్రాస్ వద్ద యరగట్టి - సవదత్తి రాష్ట్ర రహదారిపై ప్రజలు గుమిగూడి నిరసన తెలిపారు. దారుణంగా వ్యవహరించి హతమార్చిన నిందితుడు ఫయాజ్‌కు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. దుకాణాలను ప్రజలు స్వచ్ఛందంగా మూసివేశారు. బంద్‌కు ముస్లిం సామాజికవర్గం కూడా మద్దతు ఇచ్చింది. ప్రజలే స్వచ్ఛందంగా బంద్‌కు పిలుపునివ్వడంతో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీగా పోలీసులను మొహరించారు. ఒక ప్లటూర్ డీఆర్ సహా వందమందికిపైగా పోలీసులు భద్రతకు కేటాయించారు. కాగా రాజ్యసభ సభ్యుడు ఈరణ్ణ కడాడి నేతృత్వంలో బీజేపీ నాయకులు మునవళ్ళిలో నిరసన తెలిపారు. ఈరణ్ణ కడాడి మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునేలా ఘటన చోటు చేసుకుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతలు అదుపు తప్పాయన్నారు. ఓటు బ్యాంకుకోసం ఇలా వ్యవహరిస్తోందంటూ మండిపడ్డారు. రామేశ్వరం కెఫె, మంగళూరు బాంబు పేలుళ్లకు సంబంధించి కేవలం నిందితులను అరెస్టు చేస్తే చాలదని, యూపీ తరహాలో కఠిన శిక్షలు విధించాలన్నారు. కాగా మునవళ్ళి పట్టణం సాయినగర్‌లోని నిందితుడి ఇంటికి భద్రత కల్పించారు. నిందితుడి తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులు కాగా వీరిని అజ్ఞాతస్థలంలోకి తరలించినట్లు తెలుస్తోంది. ఎస్పీ డాక్టర్ భీమాశంకర్ గుళేద్ మాట్లాడుతూ యువతి హత్యతో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొందన్నారు. ప్రజలు శాంతియుతంగా నిరసన తెలిపేందుకు అవకాశం ఇచ్చామన్నారు. సవదత్తి, మునవళ్ళిలలో పరిస్థితి అదుపులో ఉందన్నారు. ప్రజలు సంయమనంతో ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఏబీవీపీ నిరసన

హుబ్బళ్ళిలో యువతి హత్యను ఖండిస్తూ అఖిలభారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో బెళగావిలోని చిన్నమ్మన సర్కిల్‌లో శుక్రవారం నిరసన తెలిపారు. నిందితుడికి ఉరి శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. 50మందికిపైగా విద్యార్థినీ విద్యార్థులు చేరి మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. గంటకుపైగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనలో ఏబీవీపీ ప్రముఖుడు రోహిత్ ఉమానాబాదిమఠ మీడియాతో మాట్లాడుతూ హత్యకు పాల్పడిన నిందితుడిని ఇప్పటికే అరెస్టు చేశారన్నారు. కాగా హోం మంత్రి పరమేశ్వర్ మాత్రం ఇద్దరూ ప్రేమించుకున్నారని, ప్రేమను నిరాకరించడంతో హత్యకు పాల్పడ్డాడని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

హత్యపై సీఎం సమీక్ష

హుబ్బళ్ళిలో విద్యార్థిని హత్యపై సీఎం సిద్దరామయ్య బెంగళూరులో డీజీపీతోపాటు ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుమారు గంటకుపైగా సమీక్ష చేశారు. ఎన్నికల వేళ శాంతి భద్రతలకు భంగం కలగవచ్చునని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా హోం మంత్రి పరమేశ్వర్ తుమకూరులో మీడియాతో స్పందిస్తూ ఇది లవ్‌జిహాదీ సంఘటన కాదని, ప్రేమను నిరాకరించినందుకే దారుణం జరిగిందన్నారు. హుబ్బళ్ళి సంఘటనపై పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమారన్ మాట్లాడుతూ హత్యకు పాల్పడిన ఫయాజ్‌ను అరెస్టు చేశామని, 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి తరలించామన్నారు.

ఘటన విచారకరం - బసవరాజ్ బొమ్మై

హుబ్బళ్ళిలో మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై మాట్లాడుతూ యువతి దారుణ హత్య ఘటన విచారకరమన్నారు. కళాశాల క్యాంపస్‌లో అదీ పట్టపగలు చోటు చేసుకుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. రౌడీలకు పోలీసులంటే భయం లేకుండా పోయిందన్నారు. ఘటనపై కేవలం సీఎం ట్వీట్ చేస్తే చాలదని, దర్యాప్తుకోసం ప్రత్యేక బృందం ఏర్పాటు చేయాలన్నారు.

రాష్ట్రపతి పాలన కోసం

బీజేపీ కుట్ర

మండిపడ్డ డీసీఎం

బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి పాలనకోసం బీజేపీ వ్యూహాత్మకంగా రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలుగుతోందని ప్రచారం చేస్తోందని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. బీజేపీ వారు తమ ప్రభుత్వంపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. శుక్రవారం కేపీసీసీలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న తరహాలో శాంతిభద్రతలు దేశంలో ఎక్కడా లేదన్నారు. హుబ్బళ్ళిలో విద్యార్థిని హత్యపై బీజేపీ నేతల వ్యాఖ్యలు తీవ్రస్థాయిలో చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన అవసరమనే రీతిలో నాటకాలు రూపొందిస్తున్నారన్నారు. నిష్పక్షపాతంగా దారుణానికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కర్ణాటక మరో బీహార్ అవుతోందని మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ఆయన పాలనలోనూ ఎన్నో ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలగలేదని ఈ విషయంలో ఎవరి జోక్యం ఉండదని పోలీసులు చట్టపరంగా చర్యలు కొనసాగిస్తారన్నారు.



రెండో విడత సమరానికి ముగిసిన నామినేషన్లు



బీజేపీ నుంచి ఇద్దరు మాజీ సీఎంలు, కేంద్ర మంత్రి

కాంగ్రెస్ నుంచి పలువురు మంత్రుల వారసులు



బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో విడత సమరంలో భాగంగా 14 లోక్‌సభ నియోజకవర్గాల్లో కీలకఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. చిక్కోడి, బెళగావి, బాగల్కోటె, బిజాపూర్, గుల్బర్గా, రాయచూరు, బీదర్, కొప్పళ, బళ్ళారి, హావేరి, ధారవాడ, ఉత్తరకన్నడ, దావణగెరె, శివమొగ్గ నియోజకవర్గాలకు రెండో విడత పోలింగ్ మే 7న జరగనుంది. ఉత్తర కర్ణాటక, మలెనాడు ప్రాంతంలో జరిగే సమరంలో అతిరథులు బరిలో ఉన్నారు. హావేరి నుంచి మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై బరిలో నిలిచారు. బెళగావి నుంచి మరో మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ పోటీలో ఉన్నారు. ధారవాడ నుంచి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి పోటీ చేస్తున్నారు. ఇక్కడ ఎన్నిక ప్రతిష్ఠాత్మకమైంది. దింగాలేశ్వరస్వామీజీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడంతో ఎన్నిక రసవత్తరంగా మారింది. కాంగ్రెస్ అభ్యర్థిగా అనిల్ అసోట బరిలో ఉన్నారు. ఇక ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంత నియోజకవర్గం కలబురగి నుంచి ఆయన అల్లుడు రాధాకృష్ణ దొడ్డమని పోటీ చేస్తున్నారు. చిక్కోడి నుంచి మంత్రి సతీశ్ జార్కిహోళి కుమార్తె ప్రియాంక జార్కిహోళి పోటీ చేస్తుండగా బెళగావి నుంచి ఏకైక మహిళా మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ కుమారుడు మృణాల్ హెబ్బాళ్కర్ బరిలో ఉన్నారు. బిజాపూర్ నుంచి కేంద్ర మాజీ మంత్రి రమేశ్ జిగజిణగి మరోసారి అభ్యర్థిగా ఉన్నారు. బీదర్ నుంచి కేంద్ర మంత్రి భగవంత్ ఖూబా పోటీ చేస్తుండగా బాగల్కోటె నుంచి మంత్రి శివానంద పాటిల్ కుమార్తె సంయుక్త పాటిల్ బరిలో ఉన్నారు. ఉత్తర కన్నడ నుంచి మాజీ స్పీకర్ విశ్వేశ్వర హెగ్డే కాగేరి పోటీ చేస్తున్నారు. దావణగెరె నుంచి రాష్ట్ర ఉద్యానవనాలశాఖ మంత్రి మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున భార్య ప్రభా పోటీ చేస్తుండగా బీజేపీనుంచి కేంద్ర మాజీ మంత్రి సిట్టింగ్ ఎంపీ జీఎం సిద్దేశ్వర్ భార్య గాయత్రి బరిలో ఉన్నారు. శివమొగ్గ నియోజకవర్గం రెండో విడత 14 నియోజకవర్గాలపైకి ప్రతిష్ఠాత్మకమైంది. ఇక్కడనుంచి యడియూరప్ప కుమారుడు రాఘవేంద్ర మరోసారి బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి మంత్రి మధుబంగారప్ప అక్క, సినీ నటుడు శివరాజ్‌కుమార్ భార్య గీతా పోటీ చేస్తున్నారు. ఇదే స్థానం నుంచి బీజేపీలో రెబెల్‌గా మారిన ఈశ్వరప్ప పోటీ చేయడం సర్వత్రా ఉత్కంఠతకు కారణమవుతోంది.

మలివిడతలో చివరి రోజు 151 నామినేషన్లు

లోక్‌సభ ఎన్నికల్లో మలివిడతలో 14 నియోజకవర్గాలకు శుక్రవారం 151 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజు 122మంది పురుషులు 132 సెట్ల నామినేషన్లను, 15మంది మహిళలు 19 సెట్ల నామినేషన్లు వేశారు. ఇంతవరకు 309మంది పురుషులు 450 సెట్ల నామినేషన్లు, 28మంది మహిళలు 53 సెట్ల నామినేషన్లు మొత్తం 503 నామినేషన్లు సమర్పించారు. వీరిలో 450 మంది పురుషులు, 53మంది మహిళలు ఉన్నారు.

నకిలీలలు

డమ్మీ రికార్డులతో 22 బ్యాంకుల్లో రూ.10కోట్ల రుణం.. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి సహా ఆరుగురి అరెస్టు



బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఆస్తి రికార్డులు సృష్టించి 22 బ్యాంకుల్లో ఏకంగా రూ.10 కోట్ల రూపాయల రుణం తీసుకున్న మోసాన్ని జయనగర్ పోలీసులు వెలుగులోకి తెచ్చారు. జయనగర్‌లోని కో-ఆపరేటివ్ బ్యాంకులో భార్యాభర్తలు నాగేశ్, సుమా రూ.1.30 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ తర్వాత మరో 21 బ్యాంకుల్లో అదే ఆస్తికి సంబంధించిన నకిలీ రికార్డులను సమర్పించి సుమారు రూ.10 కోట్లకుపైగా రుణం తీసుకున్నారు. బ్యాంకు మేనేజర్ ఫిర్యాదుతో పోలీసులు సమగ్ర దర్యాప్తు జరపగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. బేగూరు గ్రామంలో 2,100 అడుగుల స్థలంలో నిర్మాణం కోసం ఉద్దేశించి నకిలీ పట్టాలు తయారు చేశారు. అనుమానం వచ్చిన మేనేజర్ విచారణ జరపగా పలు బ్యాంకుల్లో రుణం తీసుకున్నట్లు తెలిసింది. దర్యాప్తులో భాగంగా 2024 మార్చి 16న విచారించి కోర్టులో హాజరుపరిచారు. 10 రోజుల పోలీస్ కస్టడీకి తీసుకుని తమదైన శైలిలో విచారణ జరిపారు. అపార్ట్‌మెంట్‌లో వంటపనిచేసే నాగేశ్, అతడి భార్య సుమా, భార్య తమ్ముడు, సుమా సోదరి శోభా, శోభా భర్త సతీశ్, సుమా స్నేహితురాలు వేదాలను అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆరుగురు నిందితులను సెంట్రల్ జైల్‌కు తరలించినట్లు బెంగళూరు దక్షిణ విభాగం డీసీపీ లోకేశ్ భరమప్ప జగలాసర్, జయనగర్ సబ్ డివిజన్ ఏసీపీ నారాయణస్వామి తెలిపారు.

మోదీ ప్రజాదరణ ముందు...

గ్యారెంటీలు తుస్సే

- అప్పులు తెచ్చి గ్యారెంటీలు ఎంతకాలం..?

ధారవాడ, శివమొగ్గలోనూ గెలుస్తాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పట్ల దేశవ్యాప్తంగా ప్రజాదరణ పెరుగుతోందని రాష్ట్రంలో అమలవుతున్న గ్యారెంటీలు తుస్సేనని బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన నగరంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా ప్రధానమంత్రి మోదీ అమలు చేస్తున్నారన్నారు. ఓవైపు ప్రపంచమే భారత్‌వైపు చూస్తోందన్నారు. అయోధ్యలో రామమందిరం, ఆర్టికల్ 370 రద్దు వంటివి అమలు చేశారన్నారు. ప్రపంచబ్యాంకు దేశంలో ఆర్థిక వృద్ధి సాధ్యమవుతోందని సూచిస్తోందన్నారు. ఇదేమీ బీజేపీ లేదా దేశానికి సంబంధించిన సంస్థ కాదన్నారు. 20 లక్షల కోట్లతో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. దేశమంతటా లోక్‌సభ ఎన్నికల్లో ఎటువంటి పరిణామాలు చోటు చేసుకుంటామని దక్షిణభారత్‌వైపు చూస్తున్నారన్నారు. తమిళనాడులో ఓట్లశాతంతోపాటు రెండంకెల స్థానాలు దక్కించుకుంటామన్నారు. కర్ణాటకలో అన్ని స్థానాల్లోనూ విజయం సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. శివమొగ్గలో ఈశ్వరప్ప పోటీతో లక్ష మెజారిటీ పెరగనుందన్నారు. ధారవాడలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి 2లక్షలకుపైగా మెజారిటీతో గెలిచి మరోసారి కేంద్ర కేబినెట్‌లో ఉంటారన్నారు. బెంగళూరు గ్రామీణలో నిశ్శబ్ద ఓటు పెరగనుందన్నారు. ఎన్నికలంటేనే హోరాహోరీ ఉంటుందని, అయితే ఆకర్షణ అనిపించే అభ్యర్థులను రంగంలోకి దించామన్నారు. బెంగళూరు గ్రామీణ నుంచి పేరున్న డాక్టర్ సీఎన్ మంజునాథ్‌ను, మైసూరు నుంచి యువరాజు యదువీర్‌ను పోటీ చేయించామన్నారు. రాష్ట్రంలో అనుభవం ఉన్న ముఖ్యమంత్రి ఉన్నారని, గ్యారెంటీలు అమలు చేస్తున్నారని అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఉన్న ఆదరణతో పోలిస్తే ఏమాత్రం సమానం కాదన్నారు. రాష్ట్రంలో యడియూరప్పకు ఆదరణ తగ్గలేదని, ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థులు యడియూరప్పను తమ ప్రాంతంలో ప్రచారానికి రావాలని కోరుతున్నారన్నారు. సంకల్పపత్ర ద్వారా హామీలను ప్రకటించామని, కర్ణాటక ప్రజలు మరోసారి నరేంద్రమోదీని ప్రధానమంత్రి చేయడం ద్వారా రాష్ట్రంలోని ఎంపీలను గెలిపించేందుకు ఆశీస్సులు అందిస్తారన్నారు.


మీడియాతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

రైస్ పుల్లింగ్ పేరిట

వంచన

రూ.69.79లక్షలు స్వాధీనం

ముగ్గురి అరెస్టు

బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రైస్‌పుల్లింగ్ పేరిట వంచనకు పాల్పడిన ముగ్గురిని జయనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.69.79 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ దయానంద్ శుక్రవారం మీడియాకు కేసు వివరాలు వెల్లడించారు. జయనగర్ 6వ బ్లాక్‌లోని యడియూరు చెరువు సమీపాన రైస్‌పుల్లింగ్ పాత్ర వ్యవహారం జరుగుతోందనే సమాచారంతో పోలీసులు కార్యాచరణ నిర్వహించారు. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా ఐదు రోజుల పోలీస్ కస్టడీకి అప్పగించారన్నారు. బెంగళూరు దక్షిణ విభాగం డీసీపీ లోకేశ్ భరమప్ప జగలాసర్ నేతృత్వంలో కార్యాచరణ నిర్వహించి కేసును చేధించారన్నారు.


స్వాధీనం చేసుకున్న నగదును మీడియాకు చూపుతున్న నగర పోలీస్ కమిషనర్ దయానంద్



బీదర్ కోట ఎవరిదో..?

- సీనియర్, జూనియర్ల మధ్యే పోటీ
- బీజేపీ అభ్యర్థిగా 58 ఏళ్ల కేంద్ర మంత్రి భగవంత్ ఖూబా
- కాంగ్రెస్ నుంచి 26 ఏళ్ల సాగర్ ఖండ్రె
- కుమారుడి విజయం కోసం ఈశ్వర్ ఖండ్రె ఎత్తులు

బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 28 లోక్‌సభ నియోజకవర్గాల్లో సుమారు 10 స్థానాలు భిన్నమైన అంశాలతో ఆకట్టుకుంటున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక అభ్యర్థులతో బీదర్ చర్చల్లోకెక్కింది. ఈ స్థానం నుంచి బీజేపీ తరపున జాతీయ రాజకీయాల్లో పేరొంది ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేబినెట్‌లో రసాయన, ఎరువుల శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న భగవంత్ ఖూబా మరోసారి పోటీ చేస్తున్నారు. అయితే ఆయనకు పోటీగా కాంగ్రెస్ అభ్యర్థి సాగర్‌ఖండ్రె. రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె కుమారుడు 26ఏళ్ల సాగర్‌ఖండ్రె బరిలో నిలిచారు. భగవంత్ ఖూబాను ఓడించడం ద్వారా తన కక్షను తీర్చుకోవాలని భావించిన ఈశ్వర్‌ఖండ్రె ఏకంగా కుమారుడి సాగర్‌ఖండ్రెకు కాంగ్రెస్ టిక్కెట్ దక్కించుకోవడంలో అనుకున్నది సాధించారు. భగవంత్ ఖూబా బీదర్ జిల్లాలో పేరొందిన నాయకుడు. 2014లో మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రముఖనేత ధరంసింగ్‌ను ఓడించారు. 2019 ఎన్నికల్లో ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరిస్తున్న ఈశ్వర్‌ఖండ్రెపై భారీ మెజారిటీతో విజయం సాధించారు. భగవంత్ ఖూబాకు గడిచిన రెండు ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం కొంచెం క్లిష్టంగానే ఉందంటున్నారు. ఆయనకు టిక్కెట్ ఇవ్వకూడదని రాష్ట్ర బీజేపీ ముఖ్యుడు, మాజీ మంత్రి ప్రభు చౌహాన్ తీవ్రంగా ప్రయత్నించారు. బసవకల్యాణ ఎమ్మెల్యే శరణు సలగార్ కూడా ఖూబాను వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో చౌహాన్ దూరంగా ఉన్నారు. ప్రచారంలోనూ పాల్గొనలేదు. అనారోగ్యంగా ఉన్నానంటూ ముంబైలోనే గడుపుతున్నారు. రెండు నెలలుగా ఆయన ముంబైకే పరిమితమయ్యారు. ఇక శరణు సలగార్ కూడా ప్రచారానికి దూరంగా ఉన్నారు. బీదర్ పరిధిలో 1.45 లక్షలమంది మరాఠాలు ఉన్నారు. ఇటీవలికాలంలో మరాఠాలపట్ల రాష్ట్రంలోని ప్రభుత్వం ఏదైనా వ్యతిరేకిస్తోందనే ఆగ్రహం వారిలో రగులుతోంది. కేంద్ర మంత్రిగా వ్యవహరిస్తున్న ఖూబా కూడా తమ పట్ల నిర్లక్ష్యం చేశారని ఆరోపిస్తున్నారు. ఇలా పలు అడ్డంకులు ఖూబాకు ప్రస్తుత ఎన్నికల్లో సవాల్‌గా మారుతున్నాయి. ఇక కాంగ్రెస్ అభ్యర్థి సాగర్‌ఖండ్రె రాష్ట్రంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో అత్యంత చిన్న వయస్సు కల్గినవారు. 26ఏళ్ల సాగర్ ఖండ్రె రెట్టింపు వయసున్న ఖూబాతో తలపడుతున్నారు. ఈశ్వర్‌ఖండ్రె పట్ల కూడా జిల్లాలో కొంత వ్యతిరేకత ఉంది. అఖిలభారత వీరశైవమహాసభ ప్రధాన కార్యదర్శిగాను, ప్రస్తుతం కేబినెట్ మంత్రిగాను ఉన్నారు.



ప్రతి ఎన్నికల్లోనూ ఖండ్రె కుటుంబం పోటీ చేయడాన్ని సొంత పార్టీవారే వ్యతిరేకిస్తున్నారు. బీదర్‌లో 3.50లక్షలకు పైగా ముస్లింలు ఉన్నారు. బీదర్ టిక్కెట్‌ను ముస్లింలకు ఇవ్వాలనే డిమాండ్ చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఖండ్రె కుమారుడికి అప్పగించింది. మాజీ మంత్రి రాజశేఖర్ పాటిల్ అసంతృప్తితో ఉన్నారు. మంత్రి రెహమాన్‌ఖాన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నా ఆయన పట్ల పార్టీ వర్గాలు ప్రత్యేక ఆసక్తి చూపడం లేదు. 2009 వరకు ఈ నియోజకవర్గం రిజర్వ్‌గా ఉండేది. రామచంద్ర వీరప్ప ఏడు సార్లు ఎంపీగా గెలుపొందారు. కాంగ్రెస్ నుంచి 2 సార్లు, బీజేపీ నుంచి 5 సార్లు గెలుపొందారు. నరసింహరావు సూర్యవంశి కాంగ్రెస్ నుంచి 4 సార్లు, శంకర్‌దేవ్ 3 సార్లు ఎన్నికయ్యారు. 2009లో నియోజకవర్గం విడిపోయాక ధరంసింగ్ ఎంపీగా గెలుపొందారు, 2014, 2019ల్లో భగవంత్ ఖూబా గెలుపు సాధించారు. ప్రస్తుతం పోటీలో ఉన్న ఖూబా, సాగర్‌లు ఇద్దరూ వీరశైవ లింగాయత సామాజికవర్గానికి చెందినవారే. బీదర్‌లో 3లక్షలమంది వీరశైవులు కాగా 2.7 లక్షలమంది ఎస్సీ, ఎస్టీలు ఉన్నారు. బీదర్ నియోజకవర్గం రాష్ట్రంలో వెనుకబడిన జిల్లా. రాష్ట్ర రాజధాని బెంగళూరుకు దూరంగాను, తెలంగాణ రాజధాని హైదరాబాద్ సమీపంలోనూ ఉంది. బీదర్ జిల్లాలో బసవకల్యాణ, హుమ్నాబాద్, బీదర్ దక్షిణ, బీదర్, బాల్కి, ఔరాద్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా కలబురగి జిల్లా పరిధిలో చించోళి, ఆళందలు బీదర్ లోక్‌సభ నియోజకవర్గంలో ఉన్నాయి. 8 శాసనసభ నియోజకవర్గాల్లో 5మంది బీజేపీ ఎమ్మెల్యేలు ఉండగా ముగ్గురు కాంగ్రెస్ కు చెందినవారు ఉన్నారు.



రాజకీయ వలసలు

- పరాయి రాష్ట్రాల బరిలో..రాష్ట్ర నేతలు

బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకతో సంబంధాలు కలిగిన ఐదుగురు పొరుగు రాష్ట్రాలలో లోక్‌సభ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. ఒకరిద్దరు కాకుండా ఏకంగా ఐదుగురు బరిలో ఉండడం విశేషం..

జె. శాంత, హిందూపురం వైసీపీ అభ్యర్థి



రాష్ట్ర రాజకీయాలలో ప్రముఖుడిగా రాణిస్తున్న బళ్ళారికి చెందిన శ్రీరాములుకు స్వయాన సోదరి. 2009లో బళ్ళారి ఎంపీగాను పనిచేశారు. ప్రస్తుతం హిందూపురం నుంచి వైసీపీ తరుపున లోక్‌సభ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

అశ్విని, కాసరగోడు బీజేపీ అభ్యర్థి



కేరళ రాష్ట్రం కాసరగోడు లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. బెంగళూరులో పుట్టిపెరిగారు. ఇక్కడే చదువు పూర్తి చేశారు. వృత్తి రీత్యా శిక్షకురాలిగా వ్యవహరిస్తున్నారు. అనూహ్యంగా కాసరగోడు అభ్యర్థి అయ్యారు.

శశికాంత్ సెంథిల్, తిరువళ్లూరు కాంగ్రెస్



తమిళనాడుకు చెందిన శశికాంత్ సెంథిల్ కర్ణాటక కేడర్ ఐఏఎస్ అధికారిగా వ్యవహరించారు. బళ్ళారి, శివమొగ్గ, చిత్రదుర్గ, దక్షిణకన్నడ, రాయచూరులలో సేవలందించారు. ప్రస్తుతం తిరువళ్ళూరు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు

కె. అణ్ణామలై, బీజేపీ కోయంబత్తూరు అభ్యర్థి



తమిళనాడుకు చెందిన అణ్ణామలై కర్ణాటక కేడర్ ఐపీఎస్ అధికారిగా వ్యవహరించారు. చిక్కమగళూరు, ఉడుపి జిల్లాల ఎస్పీని బెంగళూరు దక్షిణ విభాగం డీసీపీగాను పనిచేశారు. ఆతర్వాత ఐపీఎస్ హోదాలకు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ప్రస్తుత ఎన్నికల్లో కొయంబత్తూరు బీజేపీ అభ్యర్థిగా వ్యవహరిస్తున్నారు.

రాజీవ్‌చంద్రశేఖర్, తిరువనంతపురం, బీజేపీ

కేరళ రాష్ట్రానికి చెందిన రాజీవ్ చంద్రశేఖర్ దశాబ్దాల కాలంగా బెంగళూరులో స్థిరపడ్డారు. ఇక్కడే పలు వ్యాపార వ్యవహారాలు ఉన్నాయి. మీడియారంగంలోను ఉన్నారు. 2006 నుంచి వరుసగా మూడుసార్లు కర్ణాటక నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎంపికయ్యారు. తిరువనంతపురం బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.





మాలకయ్య గుత్తేదార్‌ను ఆహ్వానిస్తున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్

కాంగ్రెస్‌లో చేరిన మాలికయ్య గుత్తేదార్

బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే మాలికయ్య గుత్తేదార్ కాంగ్రెస్‌లో చేరారు. కేపీసీసీలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మాలికయ్య గుత్తేదార్‌తోపాటు శారదా మోహన్‌శెట్టి, వారి అనుచరులు కాంగ్రెస్‌లో చేరారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ వారికి కండువాలు కప్పి సాదరంగా స్వాగతించారు. మంత్రులు ప్రియాంక ఖర్గే, ఎమ్మెల్సీ గోవిందరాజు, నాగరాజ యాదవ్, కేపీసీసీ మీడియా సంచాలకులు రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాలికయ్య గుత్తేదార్ మాట్లాడుతూ కలబురగి రాజకీయం మారనుందన్నారు. బీజేపీ నేతలు తన ప్రమేయం లేకుండానే తన సోదరుడిని పార్టీలో చేర్చుకున్నారని, ఇటువంటి కుట్ర పూరిత సంఘటనలు సహించలేకనే కాంగ్రెస్‌లో చేరానన్నారు.

రెండో రోజు 29 నామినేషన్లు

అనంతపురం టౌన్/పుట్టపర్తి, ఏప్రిల్ 19: ఉమ్మడి జిల్లాలో రెండో రోజు మొత్తం 29 నామినేషన్లు దాఖలయ్యాయి. అనంతపురం ఎంపీ స్థానానికి తాడిపత్రికి చెందిన పామిశెట్టి చౌడేశ్వరి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం 14 అసెంబ్లీ స్థానాల పరిధిలో 28 నామినేషన్లు దాఖలయ్యాయి. రాప్తాడులో 5, మడకశిర, ధర్మవరం, రాయదుర్గం, గుంతకల్లు, అనంతపురం అర్బన్, ఉరవకొండలో ఒక్కొక్కటి, శింగనమల, కళ్యాణదుర్గం, తాడిపత్రి, పెనుకొండ, హిందూపురంలో రెండేసి నామినేషన్లు దాఖలయ్యాయి. కదిరిలో మూడు, పుట్టపర్తిలో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి.

- శింగనమలలో తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థిగా న్యాయవాది యాట వెంకట సుబ్బన్న, ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ అభ్యర్థిగా కప్పల నాగరాజు నామినేషన్ వేశారు. గుంతకల్లులో వైసీపీ అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే వై.వెంకట రామిరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. రాయదుర్గంలో బీఎస్పీ తరపున చిందనూరు నాగరాజు నామినేషన్ వేశారు. కళ్యాణదుర్గంలో టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు తరపున ఆయన సోదరి రాధామాధవి నామినేషన్ దాఖలు చేశారు. ఉరవకొండలో కాంగ్రెస్ తరపున మధుసూదన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. తాడిపత్రిలో టీడీపీ అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

కృష్ణగిరిలో 72 శాతం పోలింగ్ నమోదు



ఓటు హక్కు వినియోగించుకున్న అన్నాడీఎంకే అభ్యర్థి జయప్రకాశ్

ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు
పోలింగ్ ప్రశాంతం.. ఊపిరి పీల్చుకున్న పోలీసులు

హోసూరు, ఏప్రిల్ 19: కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గంలో శుక్రవారం 72 శాతం పోలింగ్ నమోదైంది. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఉత్తంగిరిలో 64.28, బర్గూరులో 67.26, కృష్ణగిరిలో 67.67, వేపనహళ్ళిలో 63.4, హోసూరులో 62.1, తళిలో 61.28 శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 వరకు సాగింది. దేశంలో తొలి విడత పోలింగ్ ప్రశాంతంగా ముగియడంపై పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఓట్లు వేసిన ప్రముఖులు

కృష్ణగిరి లోకసభ నియోజకవర్గంల్లో పోటీ పడుతున్న ప్రముఖ పార్టీల అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇండియా కూటమి అభ్యర్థి గోపినాథ్ కామరాజు కాలనీలోని పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే అన్నాడీఎంకే అభ్యర్థి జయప్రకాశ్ సిఎస్ఐ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా బీజేపీ అభ్యర్థి నరసింహన్ కూడా అక్కడే తమ ఓటును వినియోగించుకున్నారు. అన్నాడీఎంకే కేపి మునిస్వామి, డీఎంకే మాజీ ఎమ్మెల్యే సెంఘోటవన్ , కృష్ణగిరి నియోజకవర్గ పరిధిలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అన్నాడీఎంకే మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి ఆయన భార్య జ్యోతి, ప్రస్తుత హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, మాజీ ఎమ్మెల్యే, ఐఎన్‌టియూసీ జాతీయ నాయకుడు కే.మనోహరన్, మాదేశ్వరన్, తమ ఓటును వినియోగించుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగరాజ్, శ్రీనివాస్ తమ అనుచరులతో కలిసి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ఓటర్ల సంఖ్య బాగా తగ్గింది. తర్వాత సాయంత్ర వేళకు మళ్ళీ పుంజుకుంది. పోలీసులు అన్ని ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.



మేయర్ సత్య



బీజేపీ అభ్యర్థి నరసింహన్



ఎమ్మెల్యే ప్రకాశ్



కాంగ్రెస్ అభ్యర్థి గోపినాథ్



కుడితినిలో ఏర్పాటు చేసిన పింక్ బూత్

లేడీస్ స్పెషల్..

కంప్లి, ఏప్రిల్ 19 : కుడితిని పట్టణంలో పీఎస్ నెంబర్ 172, 173 లలో పింక్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మే 7వ తేదీన జరిగే లోక్‌సభ ఎన్నికల కోసం వీటిని ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. 3వ వార్డు బుడగ జంగమ కాలనీలో, పాతబస్టాండు వద్ద ప్రభుత్వ పాఠశాల కేంద్రాలలో మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా వుండటంతో అక్కడ పింక్‌బూత్‌లను ఏర్పాటు చేశారు. వీటిని మహిళల కోసమే ఏర్పాటు చేసినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు.

మోదీ సొంత డబ్బా

- ఎన్నికల ప్రచారంలో కరడి సంగణ్ణ..

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 19: ఎన్నికల ప్రచారంలో బీజేపీ మేనిఫెస్టోలోని అంశాలను పరిశీలిస్తే.. మోదీ సొంత డబ్బా తప్ప, ఎక్కడా బీజేపీ పేరు లేదని, తన పేరును అమితంగా ప్రేమించే వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది నరేంద్ర మోదీయేనని కొప్పళ మాజీ లోక్‌సభ సభ్యులు కరిడి సంగణ్ణ అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కుష్టిగి తాలూకా హిరేమన్నపూర్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్రచార సభలో లోక్‌సభ అభ్యర్థి రాజశేఖర్ హిట్నాల్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన గ్యారెంటీలను మోది పథకాలుగా చెప్పుకుంటున్నారన్నారు. కొప్పళ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ హిట్నాళ్ గెలుపు ఖాయమన్నారు. జిల్లాలో అభివృద్ధి గురించి మాట్లాడుతూ బసవరాజు రాయరెడ్డి, మంత్రి శివరాజు తంగడిగిల ద్వారానే జిల్లా అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాళ్, అభ్యర్థి రాజేశకర్ హిట్నాళ్, ప్రముఖులు జనార్దన్ హులిగి, వి.ఆర్. పాటిల్, మాలతి నాయకలతో పాటు అనేకమంది ప్రముఖులు, పార్టీ పదాధికారులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నేతలను సన్మానిస్తున్న అభిమానులు



ఓటుజాగృతి కోసం లాల్‌బాగ్‌లో విద్యార్థుల ర్యాలీ

బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని విద్యార్థులు కోరారు. బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ పర్యవేక్షణలో శుక్రవారం నగర పరిధిలోని 30కుపైగా కళాశాలల విద్యార్థులు లాల్‌బాగ్‌లో చైతన్య ర్యాలీ జరిపారు. ప్లకార్డులు చేతబట్టి ఓటు ప్రాధాన్యతన వివరిస్తూ ర్యాలీ చేశారు. లాల్‌బాగ్ ప్రాంగణంలో ఒక్కసారిగా వేలాదిమంది ర్యాలీ చేయడం ద్వారా వాకింగ్ వచ్చిన వారందరికీ ఓటు హక్కు ప్రాధాన్యత వివరించారు.


లాల్‌బాగ్‌లో యువ ఓటర్లతో బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్



నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

త్రిపురనేని మహారథి (జయంతి)



సినిమాలో పంచ్ డైలాగులకు పేరొందిన త్రిపురనేని మహారథి 1930 ఏప్రిల్ 20న కృష్ణా జిల్లా పామర్రులో జన్మించారు. అసలు పేరు త్రిపురనేని బాలగంగాధర రావు. తెలుగు సినీ మాటల రచయిత. స్క్రీన్‌ప్లే, డైలాగ్, స్క్రిప్ట్ రైటర్‌గా పేరొందారు. కృష్ణ నటించిన 'అల్లూరి సీతారామరాజు' సినిమాకు మాటలు రాయడంతో గుర్తింపు పొందారు. ఇలా 150 సినిమాలకు సంభాషణలు అందించారు. తదుపరి రాజకీయాలపై ఆసక్తితో వెనుకబడిన వర్గాలు, కులాల, తెగలు, మైనారిటీల, మహిళా, గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా 2006లో త్రిలింగ ప్రజా ప్రగతి పార్టీని స్థాపించారు. 2011 డిసెంబరు 23న కన్నుమూశారు.

అడాల్ఫ్ హిట్లర్ (జయంతి)



ప్రపంచ చరిత్రలో నియంతకు మారుపేరుగా నిలిచిన అడాల్ఫ్ హిట్లర్ 1889 ఏప్రిల్ 20న ఆస్ట్రియాలో జన్మించారు. 1933 నుంచి జర్మనీ ఛాన్సెలర్‌గాను, 1934 నుంచి మరణించేంత వరకు 'జర్మనీ నేత' (ఫ్యూరర్)గా వ్యవహరించారు. నేషనల్ సోషలిస్టు జర్మన్ వర్కర్స్ పార్టీ (నాజీ పార్టీ) వ్యవస్థాపకులు. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత నిస్తేజంగా ఉన్న సైనిక వ్యవస్థను గాడిలోకి తెచ్చారు. రెండో ప్రపంచయుద్ధంతో 1.10 కోట్ల మంది మృతి చెందగా వీరిలో 60లక్షలమంది యూదులు ఉన్నారు. దీనిని చరిత్రలో 'మానవ హననం' (హోలోకాస్ట్)గా పేర్కొంటారు. శత్రువులనుంచి కాపాడుకునేందుకు 1945 ఏప్రిల్ 30న ఆత్మహత్య చేసుకున్నారు.

పళని సుబ్రమణియ పిళ్లై(జయంతి)




కర్ణాటక సంగీతకారుడిగా పేరొందిన పళని సుబ్రమణియ పిళ్ళై 1908 ఏప్రిల్ 20న జన్మించారు. పాల్ఘాట్ మణి అయ్యర్, రామనాథపురం సీఎస్ మురుగ భూపతిలతో కలసి మృదంగ త్రయంగా పేరొందారు. మృదంగం, కంజీర వాయించడంలో నిష్ణాతులు. తండ్రి పళని ముత్తయ్య పిళ్ళై వద్దనే శిష్యుడిగా చేరి రాణించారు. ట్రావెన్‌కోర్‌కు 'ఆస్థాన విద్వాన్'గా వ్యవహరించారు. ప్రొఫెసర్‌గా సేవలందించారు. పలు పురస్కారాలు పొందారు. 1962 మే 27న తుదిశ్వాస వీడారు.

ఎంఎస్ రామయ్య (జయంతి)



మత్తికెరె సంపంగి (ఎంఎస్) రామయ్య 1922 ఏప్రిల్ 20న తుమకూరు జిల్లా మధుగిరిలో జన్మించారు. విద్యావేత్త, పారిశ్రామిక వేత్త, మానవతా వాది. దూరదృష్టితో పలు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారు. ఆయన ప్రారంభించిన 'గోకుల విద్యాసంస్థ' కాలక్రమంలో ఎంఎస్ఆర్ఐటీగా పలు విభాగాలతో అభివృద్ధి చెంది బెంగళూరులోనే కాక కర్ణాటక రాష్ట్రంలోనే ప్రఖ్యాతి గడించింది. 'తాయ్నాడు' దినపత్రిక, గోకుల వారపత్రిక, కైలాస మాసపత్రికలను నిర్వహించారు. వెనుకబడిన వర్గాల లక్షలాదిమంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. అంతేకాక కైవారలో యోగి నారేయణ తాతయ్య ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలకు కృషి చేశారు. 1997 డిసెంబరు 25న కన్నుమూశారు.

చంద్రబాబు నాయుడు (పుట్టినరోజు)



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 1950 ఏప్రిల్ 20న చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో రైతు కుటుంబంలో జన్మించారు. 1995 నుంచి 2004 వరకు, 2014 నుంచి 2019వరకు ఇలా 14ఏళ్లపాటు ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ప్రస్తుతం కుప్పం ఎమ్మెల్యేగా, శాసనసభ ప్రతిపక్షనేతగా ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయాక ఆంధ్రప్రదేశ్‌కు తొలి సీఎంగా వ్యవహరించారు. పలు మంత్రిత్వశాఖలతోపాటు కీలక హోదాలలో కొనసాగారు. ఐటీ రంగానికి ఊతమిచ్చారు.

రాజీవ్ మీనన్ (పుట్టినరోజు)



రాజీవ్ మీనన్ 1963 ఏప్రిల్ 20న కేరళ రాష్ట్రం కొచ్చిన్‌లో జన్మించారు. సినిమా డైరెక్టర్‌గా రాణించారు. 1994లో మణిరత్నం రూపొందించిన 'బాంబే' సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పేరొందారు. ఆ తర్వాత గురు, కాదల్ సినిమాలకు కూడా పనిచేశారు. తెలుగు, తమిళ, కన్నడ సినిమాలకు దర్శకత్వం, సినిమాటోగ్రఫీ చేశారు. మళయాళ సినిమాలో నటించారు. సొంత ప్రొడక్షన్స్‌ద్వారా డాక్యుమెంటరీలు, ప్రకటనలు, సినిమాలకు అవసరమైన సామగ్రిని సమకూరుస్తున్నారు.

ఘనంగా ద్యావప్ప ఉత్సవం



ద్యావప్పకు అలంకరణ

శిడ్లఘట్ట, ఏప్రిల్ 19: తాలూకాలోని ద్యావప్ప తాత దేవాలయంలో ఉట్ల పరుష ఉత్సవం ఘనంగా జరిగింది. తాతయ్యకు విశేషపూజలు, అలంకరణ అనంతరం భక్తులకు అన్నదాసోహం నిర్వహించారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులు నెయ్యి దీపాలు వెలిగించి మక్కులు తీర్చుకున్నారు. మట్టి ముంతలలో పాలను సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు కూడా ద్యావప్ప ఉత్సవంలో పాల్గొని స్వామి కృపకు పాత్రులయ్యారు. ఏటా ఉత్సవం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.

సౌలభ్యాలు కరువు.. రంగమందిరాలు వెలవెల

- కొత్తగా నిర్మాణాలను పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- వేదికలు లేక సాంస్కృతిక సందడి కనుమరుగు



నగరంలో ప్రముఖమైన రవీంద్ర కళాక్షేత్ర

బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రాచీనం నుంచి ఆధునికంవైపు సాగిన మనిషి జీవన విధానానికి రంగస్థలం, నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాల పరంపర సోదాహరణం. దక్షిణభారత్‌లో సంస్కృతి, సాహిత్యం, కళా రంగాలకు కర్ణాటక పెట్టిందిపేరు. అక్షర సంబరం, రాజ్యోత్సవం వంటి కార్యక్రమాలు రాష్ట్రాలవారీగా కనుమరుగవుతున్నా కర్ణాటకలో మాత్రం అదో పెద్ద వేడుకగానే కొనసాగుతోంది. కన్నడ సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో ఏటా జరిగే అఖిల కర్ణాటక సాహిత్యసమితి సదస్సు రాష్ట్ర ప్రగతిని రాజకీయాలను సాహిత్యాన్ని దిశానిర్దేశం చేస్తుంది. కర్ణాటకలో నాటకరంగంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిరంతరంగా సాగుతాయి. సాహిత్య సమ్మేళనాలు ప్రాంతాల వారీగా కొనసాగుతాయి. బెంగళూరులో ఏడాది పొడవునా సాంస్కృతి కార్యక్రమాలు కొనసాగే సంప్రదాయం ఉంది. కన్నడ సంస్కృతిశాఖ, బృహత్ బెంగళూరు మహానగర పాలికె పర్యవేక్షణలోని రంగమందిరాల పట్ల ఆసక్తి చూపక పోవడంతో ఆదరణ కోల్పోతున్నాయి. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి రంగమందిరాల నిర్మాణాలకు హామీలు ఇస్తుంటారు. అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరిస్తుంటారు. నగరంలోని పలు రంగమందిరాలు పేరుకు మాత్రమే అనేలా మారిపోయాయి. వాటిలో స్క్రీన్‌లు, సౌండ్‌సిస్టమ్, కుర్చీలు, శౌచాలయం వంటి సౌకర్యాల కొరత ఉన్నాయి. దీనికి తోడు సాంకేతిక సిబ్బంది పర్యవేక్షణ లేక వృథాగా మారాయి. కొవిడ్ తర్వాత కొన్ని ప్రైవేట్ రంగమందిరాలు, సభాంగణాలు ఆధునీకరణ చేశారు. అయితే సౌలభ్యాలు పెంచాలని వాటి అద్దె అమాంతంగా పెంచడంతో రంగస్థల కార్యక్రమాల నిర్వహణ భారంగా మారింది. డాక్టర్ అంబే డ్కర్ భవన్, చౌడయ్య మెమోరియల్ హాల్, సెయింట్‌జాన్స్ ఆడిటోరియం, కువెంపు కళాక్షేత్ర, రవీంద్ర కళాక్షేత్ర, గురునానక్ భవన్‌తోపాటు ఏడీఏ రంగ మందిరాలు 500కుపైగా సీట్ల కెపాసిటీ ఉంది. అయితే బాడుగ లక్ష రూపాయలు ఉండడంతో సాంస్కృతిక రంగానికి ఇదే పెనుభారం అవుతోంది. 2020లో అప్పటి సీఎం యడియూరప్ప రవీంద్రకళాక్షేత్ర తరహాలో నగరానికి నాలుగువైపులా రంగ మందిరాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం 60 కోట్ల రూపాయలు కేటాయించారు. విశ్వేశ్వరయ్య లే అవుట్‌లో 2.5 ఎకరాలు, దేవనహళ్ళి పరిధిలోని కణ్ణహళ్ళి కేఐఏడీబీ కేహెచ్‌బీలో రిజర్వు స్థలం 5 ఎకరాలలో నిర్మాణాలు చేపట్టదలిచారు. అయితే ఇప్పటివరకు నిర్మాణాల ప్రక్రియ ప్రారంభం కాలేదు.

నగరంలో 500కుపైగా సీట్ల కెపాసిటీ కల్గిన రంగ మందిరాలలో డాక్టర్ అంబేడ్కర్ భవన్ 1345 సీట్ల సామర్థ్యం కలిగిఉండగా, చౌడయ్య మెమోరియల్ హాల్ 1101, సెయింట్స్ ఆడిటోరియం 1068, కువెంపు కళాక్షేత్ర 850, రవీంద్ర కళాక్షేత్ర 830, టౌన్‌హాల్ (పురభవన) 810, హెచ్ఎన్ కళాక్షేత్ర 750, బయలురంగమందిర 741, గురునానక్ భవన్ 704, ఏడీఏ రంగమందిర 525 సీట్ల సామర్థ్యం ఉన్నాయి.

నిర్వహణా సమస్య

సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని వసంతనగర్‌లో అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌కు నిర్వహణ సమస్య ఉంది. అత్యధిక సామర్థ్యం కల్గిన వేదికగా ఉండడంతో డిమాండ్ ఉంది. అయితే సరిపడా సిబ్బంది కొరత ఇత్యాది అంశాలతో పర్యవేక్షణ సవాల్‌గా ఉంది. కన్నడ భవన్‌లోని నయన సభాంగణం చిన్నదిగా ఉండడంతో నాట్యం, చర్చాగోష్ఠులు, సంగీత కార్యక్రమాలకు అనువుగా ఉంది. కాగా జేసీ రోడ్డులోని ఏడీఏ రంగమందిరం అమెచ్యూర్ డ్రమటిక్ అసోసియేషన్ సహకారంతో కొనసాగుతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో రంగమందిరం వద్ద వాహనాలు పార్కింగ్ చేసేంతటి స్థలం లేదు. కాగా కువెంపు కళాక్షేత్రలోని గ్రీన్ రూంలు వేదికకు కిందిభాగాన ఉండడం కళాకారులకు ఇబ్బందిగా మారింది. గాంధీనగర్‌లోని గుబ్బి వీరణ్ణ రంగమందిరం, రాజాజినగర్‌లోని రాజ్‌కుమార్ రంగమందిర సహా పలు ప్రాంతాలలోని రంగమందిరాలు తగిన నిర్వహణ లేక వెలవెలబోతున్నాయి. రాష్ట్ర నాటక అకాడమీ మాజీ అధ్యక్షుడు జే లోకేశ్ అభిప్రాయం మేరకు చిన్నపాటి రంగమందిరాలను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కనీసం 300 సీట్ల సామర్థ్యం కల్గిన వేదికలు కల్పించడం ద్వారా స్థానిక సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనకు ఎంతో వీలు కాగలదన్నారు. ప్రభుత్వ రంగమందిరాల బాడుగలు సామాన్యులకు అందుబాటులో ఉండాలని, రాయితీ ధరలో కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

23న నగరేశ్వరస్వామి బ్రహ్మారథోత్సవం

- ఆలయానికి దశాబ్దాల చరిత్ర



నగరేశ్వరస్వామికి అర్ధనారీశ్వర అలంకరణ

విజయపుర, ఏప్రిల్ 19: బెంగళూరు గ్రామీణ జిల్లా దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో ఐదు రాతి రథాల బ్రహ్మారథోత్సవం జరగనుంది. సౌమ్యకృష్ణస్వామి, నగరేశ్వరస్వామి, భద్రకాళి సమేత రుద్రదేవుడు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీవెంకటరమణస్వామి బ్రహ్మ రథోత్సవం ఏటా జరగనుంది. ఇలా ఐదు రాతి రథాల రథోత్సవం ఇక్కడి ప్రత్యేకత.

జిల్లాలో అతి ఎత్తైన రాజగోపురం

సుమారు 175 ఏళ్ల చరిత్ర కల్గిన ఆలయానికి ప్రముఖ వ్యాపారి అప్పయ్యస్వామప్ప కుటుంబీకులు నిర్మించినట్టు తెలుస్తోంది. రెండు దశల్లో ఆలయాన్ని నిర్మించారు. తొలిదశలో ఆలయాలు నిర్మించగా రెండో దశలో బెంగళూరు గ్రామీణ జిల్లాలోనే అత్యంత ఎత్తైన ఆకర్షణీయమైన బంగారు తాపడం చేసిన భారీ పంచకళశాలను గోపురం ఏర్పాటు చేయడం విశేషం. ఈనెల 21 నుంచి 26 వరకు నగరేశ్వరస్వామి, ఆదినారాయణస్వామి సహా భద్రకాళి సమేత రుద్రదేవర బ్రహ్మరథోత్సవం జరగనుంది. 21న ఆదివారం ఉదయం గంగపూజ, రథకళశ పూజ, 22న సోమవారం చైత్రశుద్ధ చతుర్దశిన ప్రధాన కళశ స్థాపన, రథ కళశ స్థాపన, ప్రధాన హోమాలు, కాశీయాత్ర జరగనున్నాయి. రాత్రి 7.15 గంటలకు గిరిజా కల్యాణోత్సవం, తిరుకల్యాణోత్సవం జరగనుంది. 23న మంగళవారం చైత్ర పూర్ణిమకు ఉదయం 7.30 గంటలకు స్వామి వారికి అభిషేకం, మహాపూజ అనంతరం రథాంగ హోమం, 12గంటలకు ఉభయ స్వామివార్ల రథోత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా నవగ్రహాల ఆలయం వద్ద అన్న సంతర్పణ నిర్వహించనున్నారు. సాయంత్రం 4.45 గంటలకు హరిహర బ్రహ్మరథోత్సవం కొనసాగనుంది. బలమురి గణపతి, భద్రకాళి సమేత రుద్రదేవర బ్రహ్మారథోత్సవంలో ప్రత్యేకించి పిల్లలు, యువత ఉత్సాహంగా పాల్గొని రథాన్ని లాగుతారు. రథంపై పూలు, అరటిపండ్లు వేసి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. మంగళవారం రాత్రి రేణుకా ఎల్లమ్మదేవికి కరగ ఉత్సవం నిర్వహించనున్నారు. 24న బుధవారం పల్లకి వాహన ఉత్సవం, 25న గురువారం ఉభయ స్వామివార్లకు వసంతోత్సవం, సాయంత్రం మహాశయనోత్సవంతో ఉత్సవాలకు తెరపడనుంది.



నగరేశ్వరస్వామి ఆలయ రాజగోపురం



భూనీళా శ్రీదేవి భూదేవి సమేత ఆదినారాయణ స్వామి

ఆలయ శిఖర ప్రారంభానికి అప్పటి మైసూరు మహారాజును ఆహ్వానించేం దుకు వెళ్లిన వేళ చిన్న కార్యక్రమాలకు మహారాజు రాలేరని దివాన్ వెల్లడించారు. దీంతో మహారాజు రాకకోసం మైసూరు నుంచి విజయపుర వరకు ఆయన వచ్చే మార్గాంలో బంగారు నాణేలు వేయనున్నట్టు తెలపడంతో అంగీకరించారని తెలుస్తోంది. అంతేకాక యుద్ధం వంటి సందర్భాలలో అప్పయ్య శ్యామప్ప కుటుంబీకులు మైసూరు సంస్థానానికి రుణం రుపంలో ధనసాయం చేసేవారని తెలుస్తోంది.

ఆలయ పునరుద్ధరణ

సుమారు నాలుగైదు దశాబ్దాలు ఆలయ పర్యవేక్షణ లేక పూజాకైంకర్యాలు కూడా నిలిచిపోయాయి. సువమారు రూ.20లక్షలతో 2002లో నగర్తయువజన సంఘం, యోగదీవి యోగాగురు రవీంద్రనేతృత్వంలో చొరవ చూపి పునరుద్ధరించారు. 2006లో రాజగోపురాన్ని, పంచకళశాల పునరుద్ధరణ చేపట్టారు. 2018లో ఇందుకు కుంభాభాషేకం నిర్వహించారు. హరిహర సంగమ క్షేత్రమైన ఒకే ప్రాంగణంలో నగరేశ్వరస్వామి, నారాయణస్వామి ఆలయంలో ఉండి పూజాకైంకర్యాలు కొనసాగుతూ శైవ, వైష్ణవ సామరస్యానికి ప్రతీకగా నిలిచింది.

మోక్షగుండం రాక

విజయపుర పట్టణానికి కేవలం 15 మైళ్ల దూరంలో ఉన్న ముద్దేనహళ్ళి ప్రాంతం భారతరత్న సర్ ఎంవిశ్వేశ్వరయ్య జన్మస్థలం. దివాన్‌గా వ్యవహరించిన వేళ గాంధీచౌక్‌లోని విద్యుత్ పంచదీపాల ప్రారంభానికి విచ్చేశారు. నగరేశ్వరస్వామి ఆలయ శిఖరం ప్రారంభంలో బ్రాహ్మణ వటువుగా విచ్చేయగా వెండి నాణేన్ని దక్షిణగా స్వీకరించిన అంశం నేటికీ కథలు కథలుగా చెప్పుకుంటారు. నగరేశ్వర స్వామి ఆలయ ముందు భాగంలో నిర్మాత అప్పయ్య శ్యామప్ప, ధర్మపత్ని పార్వతమ్మల విగ్రహాలు ఏర్పాటు చేయడం వారి సేవా తత్పరతకు నిదర్శనం.

యువత పోలింగ్‌లో పాల్గొనాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎస్ సంజయ్‌గౌడ పిలుపు



పట్టాల ప్రదానంలో హైకోర్టు న్యాయమూర్తి ఎస్ఎస్ సంజయ్‌గౌడ తదితరులు

బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సమాజ నిర్మాణం కోసం యువత ఓటు హక్కు వినియోగించుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి ఎస్ఎస్ సంజయ్‌గౌడ పిలుపునిచ్చారు. శుక్రవారం సర్ ఎం విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవంలో 682 మందికి పట్టాలను ప్రదానం చేశారు. సమర్థవంతమైన అభ్యర్థులను ఓటు ద్వారా ఎన్నుకోవడంతో ఉత్తమమైన ప్రభుత్వం వచ్చేలా యువ విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈనెల 26న యువ ఓటర్లు ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. విద్యార్థి దశ కీలకమైనదని, చదువుతోపాటు నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇంజనీరింగ్ పూర్తి చేసినవారు ఉద్యోగాల వేట కాకుండా స్టార్టప్‌లు, పరిశోధనలవైపు వెళ్లాలని సూచించారు. రక్షణ పరిశ్రమ అకాడమీ, రామన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ డాక్టర్ సుదీప్ కామత్, శ్రీకృష్ణదేవరాయ విద్యాసంస్థ చైర్మన్ ఏసీ చంద్రశేఖర్‌రాజు, వైస్ చైర్మన్ శేఖర్‌రాజు, కార్యదర్శి శ్యామరాజు, కోశాధికారి వెంకటరమణరాజుతోపాటు పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ఖాయం



మాజీ ప్రధాని దేవెగౌడ తదితరులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 19: లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ఖాయమని మాజీ ప్రధాని దేవెగౌడ జోస్యం చెప్పారు. తాలూకాలోని హుణసెహళ్ళి సమీపాన ఏర్పాటైన సమావేశంలో ఆయన ప్రసంగించారు. కోలారు అభ్యర్థి మల్లేశ్‌బాబు, మాజీ మంత్రి అరవింద లింబావళి, శిడ్లఘట్ట ఎమ్మెల్యే రవికుమార్, ఎంపీ మునిస్వామి, తాలూకా జేడీఎస్ అధ్యక్షుడు డీవీ వెంకటేశ్, బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ, మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ తదితరులు పాల్గొన్నారు. మాజీ ప్రధాని దేవేగౌడ మాట్లాడుతూ తనకు 91ఏళ్లు అని అయినా లోక్‌సభ అభ్యర్థుల తరపున 28 నియోజకవర్గాల్లోనూ పర్యటించి ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. తొలి విడత ఈనెల 26న, రెండో విడత మే 7న పోలింగ్ ఉంటుందన్నారు. మోదీని మరోసారి ప్రధాని చేయడమే లక్ష్యమన్నారు. తాను సామాన్య రైతు కుటుంబం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా అసెంబ్లీలోకి వచ్చానన్నారు. సమావేశంలో బీజేపీ, జేడీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామ కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు తదితరులు

బొమ్మనహళ్ళి, ఏప్రిల్ 19: శ్రీరామనవమిని పురస్కరించుకుని అరికెరెలోని శాంతిధామలో ఉత్సవాలు రెండు రోజులపాటు ఘనంగా జరిగాయి. సాయి సేవా రక్షా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు సాగాయి. భద్రాచలం తరహాలోనే సీతారాముల కల్యాణోత్సవం జరిగినట్టు ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృష్ణ వెల్లడించారు. ఏటా శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గణపతి పూజ, పంచామృతాభిషేకం, అలంకరణ అనంతరం దశరథ మహారాజు, కౌసల్యాదేవి వేషంలో జగన్నాథశెట్టి కుటుంబీకులు, జనక మహారాజు వేషధారణలో అరుణ్‌కుమార్ కుటుంబీకులు పాల్గొన్నారు. సీతారాముల వేషధారణ ఆకట్టుకుంది. సీతారామ కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో సాగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృష్ణ కుటుంబీకులు, ట్రస్టు సభ్యులు తాతయ్యగుప్త, మనోహర్‌గుప్త, కృష్ణయ్యశెట్టి, డీవీజీ గుప్త, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా ఎండలు తీవ్రంగా ఉన్న తరుణంలో ఉచిత మజ్జిగ సేవ పంపిణీ విధానం ప్రారంభించారు. ఎండాకాలం పూర్తిగా అమలు చేస్తామన్నారు.

ఓటు హక్కుపై వీధినాటకం

చింతామణి, ఏప్రిల్ 19: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండడంతో ఓటు హక్కు వినియోగంపై పురసభ ఆధ్వర్యంలో వీధినాటక ప్రదర్శన నిర్వహించారు. తాలూకా వ్యాప్తంగా ఇప్పటికే స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో పలు జాగ్రతి ర్యాలీలు సాగాయి. ప్రస్తుతం పురసభ ఆధ్వర్యంలో సిద్ధార్థ యువజన సంఘం సహకారంతో వీధినాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. పట్టణంలోని బెంగళూరు సర్కిల్, ప్రైవేట్ బస్టాండ్ సర్కిల్, పాలిటెక్నిక్ రోడ్డు, కాలేజీ సర్కిల్ తదితర కూడళ్లలో ప్రదర్శన నిర్వహించారు. నగరసభ కమిషనర్ మాధవి పర్యవేక్షించి మాట్లాడుతూ వీధి నాటకాల ద్వారా రెండు రోజులుపాటు ఓటు హక్కుపై జాగృతి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. సరైన నాయకుడిని ఎన్నుకునే బాధ్యత ప్రజలపై ఉందన్నారు. తద్వారా అవినీతి రహిత, సమగ్ర చింతామణి అభివృద్ధి, చెత్త, ప్లాస్టిక్ రహిత పర్యావరణంతో కూడిన నగరసభగా తీర్చడమే లక్ష్యమని ఇందుకు ప్రజలంతా సహకరించాలన్నారు. సిద్ధార్థ యువజన సంఘం ఆర్‌డీ మంజునాథ్ నేతృత్వంలో వీధినాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో నగరసభ సీనియర్ ఆరోగ్య అధికారి ఆరతి, జూనియర్ అధికారి విజయకుమార్, జూనియర్ ఇంజనీర్ ప్రసాద్, నగరసభ నీటి సరఫరా ఇన్‌చార్జ్ అధికారి సీకే బాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం



మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

బాగేపల్లి, ఏప్రిల్ 19: నియోజకవర్గంలో అభివృద్ధి గురించి బహిరంగ చర్చకు సిద్ధమని కాంగ్రెస్ సవాల్ విసిరింది. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. బీజేపీ నాయకుడు సీ మునిరాజు తీరుపై మండిపడ్డారు. దమ్ముంటే రాజకీయంగా పైపోటీకి రావాలని లేనిపక్షంలో ఎమ్మెల్యేను వ్యక్తిగతంగా నిందించడం తగదని, ఇది వారి సంస్కృతికి నిదర్శనమని ఆక్రోశం వ్యక్తం చేశారు. బార్‌లకు అనుమతి ఇచ్చింది బీజేపీ ప్రభుత్వమని అవి కూడా బీజేపీ మద్దతుదారులవేనన్నారు. తాలూకాలోని హెచ్ఎన్ వ్యాలీ నీరు నింపేందుకు ఎమ్మెల్యే చొరవ చూపారన్నారు. అయితే బీజేపీ ప్రభుత్వం ఈ ప్రాంతానికి నీటి పేరిట రాజకీయం చేసి అడ్డుకున్నారన్నారు. గంటలమల్లమ్మ డ్యాంకు రూ.20కోట్లు గ్రాంటుకు అనుమతి రాగా కాగా బీజేపీ ప్రభుత్వం అడ్డుకుందన్నారు. ఇలా అభివృద్ధిని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు. మీడియా సమావేశంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పూజప్ప, మాజీ సభ్యుడు బూరగమడగు నరసింహప్ప, యువ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్, తాలూకా అధ్యక్షుడు సోమశేఖర్, డీఎస్ఎస్ నేత కడ్డీలు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యం అవసరం



సదస్సు ప్రారంభంలో సుమిత్ర రంగనాథ్ తదితరులు


బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలంటే నిరంతరం కొత్త అంశాలపై నైపుణ్యతకొరకు పాటుపడాలని ఈఆర్ఎస్‌హెచ్ సీఎల్ టెక్ కంపెనీ గ్లోబల్ డెలివరీ వైస్ ప్రెసిడెంట్ సుమిత్ర రంగనాథ్ అభిప్రాయపడ్డారు. బనశంకరిలోని బీఎన్ఎంఐటీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సును ప్రారంభించిన సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దశాబ్దకాలంలో సాంకేతిక విద్యలో అనూహ్యామైన మార్పు వచ్చిందన్నారు. కృత్రిమ మేధస్సు గురించి ఎక్కువగా అధ్యయనం చేయాల్సిన అనివార్యం ఏర్పడిందన్నారు. కొవిడ్ వేళ వైద్యరంగం, ఆన్‌లైన్ రంగాలకు ఎక్కువ ప్రాధాన్యత వచ్చిందన్నారు. ప్రస్తుతం ఇంధనం, ఆటోమొబైల్స్ విభాగాలకు డిమాండ్ పెరుగుతోందన్నారు. దేశ జీడీపీలో 18శాతం వ్యవసాయం, 27శాతం పరిశ్రమలు, 55శాతం సేవా రంగం ఉన్నాయన్నారు. యువత దేశ వనరులు పెంచుకుంటూ వ్యక్తిగతంగాను అభివృద్ధి చెందాలన్నారు. ఐఐటీ డైరెక్టర్ సడగోపన్ మాట్లాడుతూ దేశంలో మహిళా ప్రాధాన్యత పెరిగిందన్నారు. రాష్ట్రపతి, స్పీకర్ వంటి కీలక పదవుల్లో కొనసాగారన్నారు. బీఎన్ఎంఐటీ చారిటీ ట్రస్టు సభ్యులు ఈశ్వర్‌మానె, డైరెక్టర్ ప్రొఫెసర్ రామమూర్తి, డీన్ ఈశ్వర్‌మానె, అడిషినల్ డైరెక్టర్ ఎస్‌వై కులకర్ణి, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కీటకాల సంరక్షణ కోసం కెఫె



ఇన్‌సెక్ట్ కెఫె ప్రారంభంలో ప్రముఖులు

బెంగళూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కీటకాల సంరక్షణ కోసం ఈవై గ్లోబల్ డెలివరీ సర్వీసెస్ ఇన్‌సెక్ట్ కెఫె పేరిట ప్రత్యేక నిర్మాణాన్ని లాల్‌బాగ్‌లో ఆవిష్కరించారు. ఇండియా ఫౌండేషన్, ఈవై గ్లోబల్ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా 21 కెఫెలను ఏర్పాటు చేయదలిచినట్టు సంస్థ సీఓఓ మనేశ్ పటేల్ తెలిపారు. లాల్‌బాగ్, కబ్బన్‌పార్క్‌లలో కెఫెలను ప్రారంభించదలిచామన్నారు. క్రిమి కీటకాల సంరక్షణతో ప్రకృతి, భూమిలో సాంద్రత సాధ్యమవుతుందన్నారు. పర్యావరణ ప్రేమికులంతా కలసి ఇన్‌సెక్ట్ కెఫెను రూపొందించామన్నారు. 300 మంది వలంటీర్లుగా ఉన్నట్టు తెలిపారు. పర్యావరణానికి భంగం కలిగించేలాంటి చర్యలు ప్రతిచోటా అనునిత్యం చోటు చేసుకుంటున్నాయని, ఇండియా ఫౌండేషన్ ద్వారా కీటకాల సంరక్షణ మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరిలోనూ కీటకాలు, భూమి, పక్షులను కాపాడుకోవాలనే సందేశం ఇవ్వదలిచామన్నారు. ఉద్యానవనశాఖ డైరెక్టర్ డీఎస్ రమేశ్, జాయింట్ డైరెక్టర్ జగదీశ్, లాల్‌బాగ్ డిప్యూటీ డైరెక్టర్ కుసుమాలు భాగస్వామ్యులయ్యారు. ఇన్‌సెక్ట్ కెఫెల నిర్మాణం తర్వాత మైసూరు ఉద్యానవన కళాశాల సహకారంతో కీటకశాస్త్రాలు విద్యార్థులకు పరిశోధనల అధ్యయనంపై జరిపించదలిచామన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.70	1,576.77
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	112	243
సామర్థ్యం (టీఎంసీలు)	3.87	3.10

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి



ర్యాలీలో నోడల్ అధికారి రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, ఏప్రిల్ 19: ఓటు హక్కు ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిన హక్కు అని పటిష్ట ప్రజాస్వామ్యం కోసం తప్పకుండా ఓటు వేయాలని జిల్లా స్వీప్ కమిటీ నోడల్ అధికారి, జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప విజ్ఞప్తి చేశారు. జిల్లాస్వీప్ కమిటీ, స్త్రీ శిశు అభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని బెల్లల్ రోడ్డు నుంచి ప్రారంభమైన జెండా ఊరేగింపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఓటింగ్‌లో ప్రతి ఒక్కరు పాల్గొనాలన్నారు. గతసారి కంటే ఈసారి ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. నగరంలో బెల్లల్ రోడ్డు నుంచి ప్రారంభమైన పంజీల ఊరేగింపు కౌల్‌బజార్ మీదుగా మొదటి రైల్వేగేటు దగ్గర ముగిసింది. ఈసందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఖలీల్‌సాబు, చీఫ్ ప్లానింగ్ అధికారి వాగీష్ శివాచార్యులు, తాలూకా పంచాయతీ ఈఓ మదగిన బసప్ప, బళ్లారి తాలూకా పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల పాదయాత్ర



అవగాహన యాత్రలో తపాలా ఉద్యోగులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 19: ఓటింగ్‌పై అవగాహనలో భాగంగా శుక్రవారం నగరంలోని పోస్టల్ ఉద్యోగులు చేపట్టిన పాదయాత్రను పోస్టల్ సూపరింటెండెంట్ వీ.ఎల్. చితకోటి ప్రారంభించి మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు అర్హులైన అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. మే 7న అర్హులైన ప్రతి ఓటరు తప్పకుండా ఓటు వేయాలన్నారు. నగరంలోని కనకదుర్గమ్మ దేవస్థానం నుండి ప్రారంభమైన పాదయాత్ర తాళూరు రోడ్డు, కప్పగల్‌రోడ్డు, గాంధీనగర్ మార్కెట్, మోకారోడ్డు మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో మహానగర పాలక సంస్థ కమిషనర్ ఖలీల్‌సాబు, జిల్లాపంచాయితీ ముఖ్య ప్రణాళిక అధికారి వాగీష్ శివాచార్యులు, తపాలా శాఖలోని సిబ్బంది పాల్గొన్నారు.

హోసగేరప్పకు ప్రత్యేక పూజలు



హోసకేరప్ప, వడ్డట్టప్పకు ప్రత్యేక పూజలు

కంప్లి, ఏప్రిల్ 19: తాలుకా పరిధిలోని దేవలాపురం గ్రామంలో ఆలుమత సమాజానికి చెందిన మల్లెలోరా గోత్ర వంశీకులు హోసకేరప్ప, వడ్డట్టప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల సందర్భంగా 12 సామూహిక వివాహాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాగినేల నిరంజనానందాపురి స్వాములు, రోహితయ్య స్వామి వడియార్, గురుసిద్దలింగయ్య స్వామి వడియార్, జడియప్ప స్వామి వడియార్, గురుపాదప్ప స్వామి, విరుపాక్షయ్య స్వామి తదితరులు పాల్గొని నూతన జంటలను ఆశీర్వదించారు. ప్రతి యేటా ఆలుమత సమాజం వారు హోసకేరప్ప, వడ్డట్టప్పకు ప్రత్యేక పూజలు చేసి వివిధ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం వల్ల సమాజంలో గుర్తింపు పొందుతారని తెలిపారు. అలాగే ప్రతిరంగంలో ముందడుగు వేయాలని సూచించారు. సమాజ పదాధికారులు పాల్గొన్నారు.



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న స్వతంత్ర అభ్యర్థి వీరేష్



నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రహార జనశక్తి పార్టీ అభ్యర్థి మంజునాథ్ గోసాల్

ముగిసిన నామినేషన్ల పర్వం

- చివరిరోజు మూడు నామినేషన్లు..
- బరిలో మొత్తం 13 మంది అభ్యర్థులు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 19: బళ్ళారి లోక్‌సభ స్థానానికి సంబంధించి శుక్రవారంతో నామినేషన్‌ల పర్వం ముగిసింది. ఆఖరి రోజున శుక్రవారం రోజు ముగ్గురు నామినేషన్‌లు వేశారు. పిజెపి (ప్రహారా జనశక్తి పార్టీ) అభ్యర్థి మంజునాథ్ గోసాల్ రెండు సెట్లు నామినేషన్ పత్రాలు అందజేయగా, స్వతంత్ర అభ్యర్థి వీరేష్, నవ భారత్ సేనా పార్టీ అభ్యర్థి జి.స్వామి ఒక్కో సెట్టు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 12వ తేదీన విడుదలకాగా వివిధ పార్టీలకు చెందిన నలుగురు నామినేషన్లు వేశారని, 15వ తేదీన ఒక అభ్యర్థి, 17వ తేదీన నలుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారని, 18వ తేదీన ఒకరు, శుక్రవారం ముగ్గురు నామినేషన్‌లు వేశారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు బళ్ళారి లోక్‌సభ స్థానానికి 13మంది అభ్యర్థులు నామినేషన్‌లు వేసినట్లు ఆయన వివరించారు. శనివారం రోజున నామినేషన్‌ల పరిశీలన, ఏప్రిల్ 22న నామినేషన్‌ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు.



నామినేషన్ వేస్తున్న నవ భారత సేనా అభ్యర్థి జి.మధుస్వామి

చేపల వేటకు నదికి వెళ్లి ఇద్దరి మృతి

కంప్లి, ఏప్రిల్ 19: హోస్పేట తాలుకా పరిధిలోని బుక్కసాగర వద్ద తుంగభద్ర నదిలో పడి ఇద్దరు మృతి చెందారు. దీనిపై కమలాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కమలాపురం గ్రామానికి చెందిన రమేష్ (28), అతనితో పాటు అతని తమ్ముడి కుమారుడు తరుణ్ (5) ఇద్దరు బుక్కసాగర వద్ద చేపలు పట్టేందుకు వెళ్లారు. నది వద్ద చేపలు పడుతుండగా నది ఒడ్డున ఆటలాడుకుంటున్న ఐదేళ్ల బాలుడు తరుణ్ ఆటలాడుతూ అదుపుతప్పి నదిలో పడ్డాడు. వెంటనే చేపలు పడుతున్న రమేష్ గమనించి తరుణ్‌ను కాపాడేందుకు వెళ్లాడు. అక్కడ లోతైన గుంత వుండటంతో అందులో పడి రమేష్ కూడా మృతి చెందాడు. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

వేసవిలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 19: కరువు దృష్ట్యా ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు పాఠశాల విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సెలవుల్లో కూడా కొనసాగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిచెళ్లగుర్కి తెలిపారు. తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాల పిల్లలతో ఇంటింటికి వెళ్ళి పథకం ప్రాధాన్యతను గురించి శుక్రవారం తల్లిదండ్రులకు తెలియజేశారు.

కరుణించిన వరుణుడు

- వడగళ్ల వాన, ఈదురుగాలులు
- నేలకు ఒరిగిన చెట్లు, కూలిన విద్యుత్తు స్తంభాలు

బళ్లారి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): బళ్లారి, విజయనగర జిల్లాలను వరుణుడు కరుణించాడు. కొన్నిప్రాంతాల్లో బలమైన ఈదురు గాలులతో పాటు వగడళ్ల వాన కురిసింది. ఎండలకు ఉక్కిరి బిక్కిరైన రైతన్నకు వర్షం కాస్త ఉపశమనం కల్గించింది. తోరణగల్లు, సండూరు, విజయనగర, సిరుగుప్ప ప్రాంతాల్లో గురువారం రాత్రి బలమైన ఈదురుగాలతో పాటు వడగళ్ల వాన కురిసింది. శుక్రవారం విజయనగర, గంగావతి, కారటగి, గాంధీనగర ప్రాంతాల్లో తేలిక పాటి జల్లులతో పాటు బలమైన గాలులు వీచాయి. కొన్నిచోట్ల చెట్లు కూలిపోగా, మరికొన్నిచోట్ల విద్యుత్తు స్తంభాలు నేలకు వాలి విద్యుత్తు తీగలు తెగి సరఫరాకు అంతరాయం కలిగింది. ఈవర్షంతో కాస్త ఉపశమనం కలిగిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో చల్లటి వాతావరణం నెలకొందని



తోరణగల్లులో వానలో వెళుతున్న వ్యక్తి



కాకుబాల్ గ్రామంలో నేలరాలిన వడగండ్లు

ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక అడవిలో ఉండే పశుపక్ష్యాదులకు కాస్త తాగునీరు దొరుకుతుందని రైతులు పేర్కొంటున్నారు.

అకాల వర్షాలకు నేలకొరిగిన ధ్వజస్తంభం

కంప్లి, ఏప్రిల్ 19 : హరప్పనహళ్లి తాలుకాలో గురువారం రాత్రి గాలివానకు కొన్ని చెట్లు విరిగిపడటంతో పాటు ఇళ్లు కూలాయి. అలాగే మండ్లగేరి తాండాలో మోతీనాయక్, బలభీమ నాయక్‌కు చెందిన ఇంటి పైకప్పులు కూడా గాలివానకు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అలాగే అలగనూరు గ్రామంలో చెరువు ఒడ్డున వుండే కంబునప్ప దేవస్థానం ముందున్న ధ్వజస్తంభం పిడుగుపాటుకు నేలకొరిగింది. ఒక్కసారిగా ఈదురుగాలులు, వర్షం, మెరుపులు, పిడుగులు రావడంతో ప్రజలు సతమతమయ్యారు. అలాగే హోస్పేటతాలుకాలోని కాకుబాల్ గ్రామంలో వడగండ్ల వర్షం పడింది. ఈ వర్షాలకు అరటి, జామ, బొప్పాయి, తదితర పంటలు పూర్తిగా నష్టపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వివిధ సంఘ సంస్థ నేతలు కోరారు.

విరుపాక్షేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.10లక్షలు



హంపీలో హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

బళ్లారి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): హంపీ విరుపాక్షేశ్వర స్వామి ఆలయ ప్రధానహుండీని శుక్రవారం లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.10,65 లక్షల నగదు తోపాటు ఒక అమెరికన్ డాలర్‌ను గుర్తించారు. ప్రస్తుతం మూడు నెలలకు సంబంధించిన హుండీని లెక్కించామని ఈవో తెలిపారు.

గంగావతిలో జోరందుకున్న కాంగ్రెస్ ప్రచారం

గంగావతి రూరల్, ఏప్రిల్ 19: గంగావతిలో రోజు రోజుకు కాంగ్రెస్ ప్రచారం జోరందుకుంటోంది. కొప్పళ కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ హిట్నాల్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ హెచ్.ఆర్. శ్రీనాథ్ కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇప్పటికే ఐదు గ్యారెంటీల ద్వారా ప్రజలకు చేరువైందన్నారు. ప్రతి మహిళకు ప్రతినెల రూ.2000 నగదు, రేషన్ బియ్యం, ఉచిత కరెంటు ఇస్తోందన్నారు. పేద ప్రజలకు ఎంతో అనుకూలమైన రీతిలో కాంగ్రెస్ పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద బలహీన వర్గాలకు అండగా ఉంటుందని, కర్ణాటకలో 20 స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు. ఈసందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శామీద్ మనియా, ఆయుబుఖాన్, జిలాన్ బాష, రజియా బేగం, రమణయ్య, యమునమ్మ, శకుంతల తదితర కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొప్పళ్ కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ గెలుపు తథ్యం

సిరుగుప్ప, ఏప్రిల్ 19 : లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ ఇత్నాల్ గెలుపు తథ్యమని ఎమ్మెల్యే బీఎం నాగరాజు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం సిరుగుప్ప తాలుకాలోని టెక్కలకోట, కరూరు, మండల పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ తరపున ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. వాడవాడలా ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది కార్యకర్తలు, ప్రజలు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పరిపాలన వస్తే మహిళలకు రూ.లక్ష బ్యాంకు ఖాతాకు జమచేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

సిరుగుప్ప, ఏప్రిల్ 19 : తాలుకాలోని టెక్కలకోట పట్టణ పరిధిలో దేవీనగర్ గ్రామంవైపు బైకులో తీసుకెళుతున్న అక్రమ మద్యాన్ని ఎక్సైజ్ కమిషనర్ స్వాధీనంచేసుకుని ఓవ్యక్తిని అరెస్టు చేశారు. సిరుగుప్ప తాలుకాలోని టెక్కలకోట నుంచి దేవీనగర్ వైపు వెళుతున్న ఒక వ్యక్తిని స్థానికుల సమాచారం మేరకు 17500 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. ఈ మేరకు కేసు దాఖలైంది.

అన్‌లైన్‌లో రూ.1.21 కోట్లకు మోసం

బళ్లారి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జిందాల్ స్టీల్ వర్స్ కంపెనీ(జేఎస్‌డబ్ల్యూ)లో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్న హేమంత్ నానోర్‌గారే అన్‌లైన్ లో రూ.1.21 కోట్లు మోసపోయినట్లు సైబర్ క్రైం పోలీసులు తెలిపారు. ఇటీవల ఫేస్‌బుక్‌లో ఫేర్‌హూల్డర్స్ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూప్ అనే ప్రకటన వచ్చింది. దీన్ని ఆయన క్లిక్ చేసి వాట్స్ యాప్ గ్రూపులో యాడ్ అయ్యారు. గ్రూప్‌లో అడ్మిన్ నంబరు 447731302604 ఇచ్చారు. ఈ గ్రూప్ అడ్మిన్ సూచన ప్రకార్ నానార్‌వేరే అన్‌లైన్ ఖాతాలో జాయిన్ అయ్యారు. రూ. లక్ష పెట్టబడి పెడితే480 శాతం లాభం వస్తుందని గ్రూప్ తెలిపింది. దీనికి జిందాల్ మేనేజర్ యాడ్ అయ్యి మార్చి 20 నుండి ఏప్రిల్ 17 వరకూ విడతల వారిగా మొత్తం రూ.1.21 కోటి 50వేలు చెల్లించారు. అయితే ఫేస్‌బుక్ అడ్మిన్ నుండి ఎటువంటి రిప్లై రాకుండా పోవడంతో ఆయన ఏప్రిల్ 17న బళ్లారి సైబర్ క్రైంకి ఫిర్యాదు చేశారు.

హుబ్బళ్లి విద్యార్థిని హత్యకు నిరసన

- లవ్ జిహాద్ అంటూ బీజేపీ ఆగ్రహం
- దోషులకు ఉరిశిక్ష వేయాలని డిమాండ్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 19: హుబ్బళ్లిలో ఓ యువకుడు బాలిక మెడపై కత్తితో పొడిచి హత్య చేసిన ఘటనను ఖండిస్తూ శుక్రవారం బళ్లారిలో నిరసనప్రదర్శన జరిగింది. వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో బళ్లారి రైల్వేస్టేషన్ గాంధీ విగ్రహం వద్ద జరిగిన ఈ నిరసనలో నిందితులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఇది లవ్ జిహాద్ అంటూ బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. హుబ్బళ్ళి బీవీబీ క్యాంపస్‌లో గురువారం స్థానిక మహానగర పాలిక సభ్యురాలి కుమార్తె నేహా హిరేమఠ్ హత్యకు గురయ్యారు. ఈహత్య కేసులో నిందితుడైన ఫయాజ్ హుబ్బళ్ళి పోలీసులు అరెస్టు చేశారు. అమాయక యువతిని హత్య చేసిన నిందితుడికి ఉరిశిక్ష వేయాలని ప్రదర్శనకారులు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో మహేశ్వర స్వామి, గురుసిద్దస్వామి, కిరణ్‌కుమార్, యర్రిస్వామి, బసవరాజ్, గౌరీశంకర్‌స్వామి, మంజునాత్ గోవిందవాడా, చంద్రోశేఖర్, కోరి విరూపాక్షప్ప, హొన్నన గౌడ్, జీవీ, మంజునాథ్, గంగావతి వీరేశ్, బండేగౌడ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కొవ్వొత్తుల ప్రదర్శన

బళ్లారిరూరల్: బళ్లారి నగరంలో శుక్రవారం సాయంత్రం దుర్గమ్మగుడి రోడ్డు ఈడిగ హాస్టల్ నుండి రైతు సర్కిల్ వరకు బీజేపీ మహిళా కార్యకర్తలు పెద్దఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నేహాను హత్య చేసిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని కోరారు. ఆడపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని, హత్య చేసే వారిపై ప్రభుత్వాలు, న్యాయస్థానాలు కఠిన శిక్షలు అమలు చేసే విధంగా చూడాలన్నారు. అప్పుడే ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా వుంటాయని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు సుగుణ, సాధన, సుగుణ, అలివేలు, పుష్ప హంపి రమణమ్మ, గుత్తిగనూరు వీరుపాక్షిగౌడ, రాజు, అరుణ్, బాలచంద్ర, ఓం ప్రకాష్, సుధాకర్, కిరణ్, సిద్దేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధికారులకు వినతి పత్రం ఇస్తున్న నిరసనకారులు

హోసూరు జోన్



ఓటువేసిన మాజీ మంత్రి బాలకృష్ణారెడి



మాజీ ఎమ్మెల్యే మనోహరన్



ఆర్ పూసారిపట్టిలో ఓటు వేయడానికి క్యూ కట్టిన ప్రజలు

ఓటుకోసం తరలివచ్చిన ప్రజలు

హోసూరు(మత్తిగిరి), ఏప్రిల్ 19: సరిహద్దులోని బెంగళూరు సహా కర్ణాటకలోని ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న తమిళులు గురువారం రాత్రి నుంచి తమిళనాడులోని తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. తమిళనాడులోని వేలూరు, విళుపురం, తిరువణ్ణామలై నుంచి గురువారం రాత్రి వచ్చి తమ స్వగ్రామాలు చేరుకున్నారు. హోసూరు ప్రాంతాల్లో నివసిస్తున్న తమిళనాడులోని వివిధ జిల్లాల ప్రజలు తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు హోసూరు బస్టాండుకు రావడంతో రద్దీ నెలకొంది. తగినన్ని బస్సులు లేక ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డిమాండ్ దృష్ట్యా ఇదే అదునుగా కొన్ని ప్రైవేట్ బస్సు సర్వీసులు అధిక చార్జీలు వసూలు చేశారన్న విమర్శలు వినిపించాయి.

సక్రమంగా ఏర్పాట్లు: కలెక్టర్

ఓటు హక్కు వినియోగం కోసం అన్ని బూత్‌లలో తగిన ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కేఎం సరయు తెలిపారు. తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి భైనపల్లి యూనియన్ ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో శుక్రవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తర్వాత ఆమె జిల్లాలో కొన్ని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి పోలింగ్ సరళిని పరిశీలించారు.

తప్పుడు ప్రచారం తగదు: సబ్ కలెక్టర్

హోసూరు, ఏప్రిల్ 19: ఎన్నికల విధి నిర్వహణలో అవాంతరం తలెత్తితే అందుబాటులో ఉండేలా ప్రత్యామ్నాయ సిబ్బందిని కేటాయించారు. హోసూరు ఆంధ్రసమితి మండపం వద్ద 200 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు గురువారం రాత్రి నుంచి సిద్ధంగా ఉన్నారు. ప్రత్యామ్నాయ ఎన్నికల సిబ్బందికి ఎన్నికల సంఘం వసతి, మరుగుదొడ్లు, తాగునీరు, ఆహారం సక్రమంగా అందించడం లేదనే విమర్శలతో హోసూరు సబ్ కలెక్టర్ ప్రియంక, హోసూరు తహసీల్దార్ విజయకుమార్ అక్కడికి చేరుకున్నారు. తప్పుడు ప్రచారం చేయరాదని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రత్యామ్నాయ సిబ్బందికి తగిన భత్యం సమకూర్చామన్నారు.



సిద్ధంగా ఉన్న ప్రత్యామ్నాయ సిబ్బంది

చివరి రోజు రాయచూరులో ఐదు నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి రాజా అమరేశ్వర్ నాయక్



ఎస్‌యూసీఐ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న రామలింగప్ప

రాయచూరు, ఏప్రిల్ 19 : లోకసభ ఎన్నికల నామినేషన్‌ల దాఖలుకు చివరి రోజైన శుక్రవారం ఐదుగురు తమ నామినేషన్‌లను జిల్లాధికారి, ఎన్నికల అధికారి చంద్రశేఖర్ నాయక్‌కు అందజేశారు. బీజేపీ అభ్యర్థిగా ఇప్పటికే మూడు సెట్‌లు నామినేషన్‌లు సమర్పించిన సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్, చివరి రోజు మాజీ ఎమ్మెల్యే ఎన్.శంకృప్ప, మాజీ ఎమ్మెల్యే తిప్పరాజు హవాల్దార్‌లతో కలిసి మరో సెట్టు నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థిగా శామరావ్ మేదర్, తన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్‌కి అందజేశారు. ఆయన వెంట రామలింగప్ప ఉన్నారు. మరో స్వతంత్ర అభ్యర్థిగా యల్లమ్మ బసవరాజ్ సుంకేశ్వరహాళ్ నామినేషన్ వేయగాఆమె వెంట రంగప్ప నాయక్, సునీల్ కుమార్ అమరేశ్ నాయక్‌లున్నారు. ఎస్‌యూసీఐ పార్టీ అభ్యర్థిగా రామలింగప్ప నామినేషన్ వేయగా ఆయన వెంట ఎన్.ఎస్.వీరేశ్, చన్నబసవ జానేకల్ ఉన్నారు.

మరో స్వతంత్ర అభ్యర్థి కే దేవణ్ణ నాయక్ మరో సెట్ నామినేషన్‌ను చివరి రోజు జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్‌కు అందజేశారు. ఆయన వెంట హనుమేశ్ కరుణగి, మహ్మద్ రఫీవుల్లా, అహ్మద్, వీరనగౌడ ఉన్నారు.

నరేంద్ర మోదీ పాలనపై ప్రజల్లో సంపూర్ణ విశ్వాసం

రాయచూరు, ఏప్రిల్ 19 : పదేళ్లలో దేశం సాధిస్తున్న ప్రగతిని నిశ్చితంగా గమనిస్తున్న ప్రజలు నరేంద్ర మోదీ పాలన పట్ల సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని బీజేపీ లోకసభ అభ్యర్థి అమరేశ్వర్ నాయక్ అన్నారు. మరో సారి మోదీని ప్రధానిగా చూసేందుకు ప్రజలు తహతలాడుతున్నారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 4వ సెట్ నామినేషన్ వేసిన అనంతరం శుక్రవారం ఆయన కొద్దిసేపు మీడియాతో ముచ్చట్టించారు. గత ఎన్నికల్లో తాను లక్ష ఓట్ల పైగా మెజార్టీతో విజయం సాధించానని ఈ సారి అంతకంటే ఎక్కువ మెజార్టీతో గెలువబోతున్నట్లు దీమా వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ సమర్థ పాలనతో 5వ స్థానానికి ఎగబాకిందని